## క్లుప్తంగా

### తుంగతో అనారోగ్యం



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుస్నాబాద్: పట్టణంలోని ఖాళీ స్థలాలు, పొలాల్లో మొలచిన తుంగను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి కోరారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుంగ వల్ల ప్రజలకు శ్వాస, ఎలర్జీ, చర్మ సంబంధిత రోగాలకు గురవుతున్నారన్నారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం, నాగులమ్మ దేవాలయం రోడ్డు వరకు ఉన్న పొలాల్లో ఎక్కువగా పెరిగిందని చెప్పారు. పట్టణమంతా వ్యాప్తి చెందకముందే చర్యలు తీసుకోవాలని కోరారు. రేమిడి వెంకట్రాంరెడ్డి, గడిపె మల్లేశ్, మల్లారెడ్డి, రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

### లేబర్ ఇన్సూరెన్స్‌తో లబ్ధి



ఇన్సూరెన్స్ చేయిస్తున్న బీజేపీ నేతలు

గజ్వేల్‌రూరల్: కార్మికులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రిమ్మనగూడలో శనివారం బీజేపీ మండలశాఖ ఉపాధ్యక్షుడు భీమ్‌కుమార్, బూత్ అధ్యక్షుడు నవీన్ కుమార్, శ్యాంకుమార్ తమ సొంత డబ్బులతో గ్రామంలోని పలువురు కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ చేయించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలు, కార్మికులు ఏదైనా ప్రమాదం జరిగినపుడు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సురేశ్, స్వామి, అరవింద్, షణ్ముఖగౌడ్, చందు, నర్సింహులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల తనిఖీలు



ఓ ఇంట్లో సోదా చేస్తున్న ఎస్‌ఐ సౌజన్య

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలో ఎస్‌ఐ సౌజన్య ఆధ్వర్యంలో శనివారం జాగిలాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వ్యాపార సంస్థలు, అనుమానిత ప్రాంతాలలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అరికట్టడంలో భాగంగా ఈ తనిఖీలు చేశారు. కార్యక్రమంలో తనిఖీ బృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### శాశ్వత పరిష్కారం చూపండి



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

హుస్నాబాద్: పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నీట మునిగిన దుకాణాలు, బస్టాండ్ ఆవరణలను శనివారం బీజేపీ నాయకులు పరిశీలించారు. పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు మాట్లాడుతూ భారీ వర్షాలకు ప్రధాన రహదారులు, దుకాణాలు నీట మునిగి వ్యాపారులు నష్టపోతున్నారన్నారు. ఇటీవల రూ.2 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టినా బస్టాండ్ ఆవరణ మొత్తం బురదమయంగా మారిందని వాపోయారు. వర్షాలు కురిసినప్పుడే మున్సిపల్ అధికారులు ఫొటోలు దిగి ప్రచారం చేసుకుంటున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఉనికి కోసమే ఆరాటం

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్‌ఎస్ నాయకులు ఉనికి కోసమే ఆరాట పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్దెల రాజేశం, పార్టీ సీనియర్ నాయకుడు ఎనగంటి కిష్టయ్య విమర్శించారు. శనివారం మిరుదొడ్డిలో వారు విలేకరులతో మాట్లాడుతూ పది సంత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీకి పల్లెల అభివృద్ధి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 20 నెలల్లోనే ఎక్కువ అభివృద్ధి చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రైతుకు కూడా పంట రుణమాఫీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు లేదని మండిపడ్డారు. నాయకులు భూపాల్ గౌడ్, హర్షద్, మహేశ్, మహేందర్‌రెడ్డి, నరేశ్, రాజు, సత్తిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆదర్శ’లో అన్నీ సమస్యలే!

పేరుకే ఆదర్శ హాస్టల్.. కానీ అన్ని సమస్యలే.. నీటి కొరత, అపరిశుభ్ర మరుగుదొడ్లు, ప్రహరీ లేకపోవడం, సరిపడా సిబ్బంది లేకపోవడం.. ఇలా ఎన్నో ఇబ్బందుల మధ్య హాస్టల్ కొనసాగుతోంది. ఊరికి దూరంగా ఉండడం, ప్రహరీ లేకపోవడం, విషసర్పాలతో ప్రమాదం పొంచి ఉండడంతో విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జగదేవ్‌పూర్ ఆదర్శ హాస్టల్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలు

**సరిపడా సరఫరా కాని నీరు**
- ప్రహరీలేక భయం.. భయం
- విష సర్పాలతో పొంచివున్న ప్రమాదం
- సిబ్బందిలేక ఇబ్బందులు
- విద్యార్థినులకు తప్పని తిప్పలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో 17 యేళ్ల క్రితం మోడల్ స్కూల్ ప్రారంభమైంది. ఈ భవనానికి ప్రహరీ నిర్మించలేదు. కొన్నేళ్ల తర్వాత ముందు భాగంలో నిర్మించి వెనుక భాగంలో వదిలేశారు. హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థినులు వంద మంది ఉంటున్నారు. భవనం వెనుక పిచ్చి మొక్కలు, పొదలు ఏపుగా పెరిగాయి. వర్షాకాలంలో విషసర్పాలు, పురుగులు హాస్టల్ ఆవరణలోకి వస్తున్నాయని, వాటితో ప్రమాదం పొంచి ఉందని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు.



ప్రహరీలేని భవనం

**వేధిస్తున్న నీటి కొరత**

హాస్టల్‌ల్లో విద్యార్థినుల అవసరాలు, వంటకు సరిపడా నీళ్లు సరఫరా కావడం లేదు. పాఠశాల, హాస్టల్ ఆవరణల్లో రెండు బోరు బావులున్నా వాటికి మోటారు, విద్యుత్ కనెక్షన్ లేదు. దీంతో వృథాగా పడిఉన్నాయి. పలుసార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందనే ఆవేదన వ్యక్తమవుతోంది.

**సరిపడా సిబ్బంది లేక..**

హాస్టల్‌లో ప్రత్యేక అధికారి, కేర్ టేకర్, హెడ్ కుక్, ఇద్దరు అసిస్టెంట్ కుక్‌లు, అలాగే ఏఎన్‌ఎం, వాచ్‌మెన్, స్కావెంజర్ ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ప్రత్యేక అధికారి, కేర్ టేకర్, హెడ్ కుక్, ఏఎన్‌ఎం మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వేతనం ఉండడం వల్ల మిగతా సిబ్బంది రావడానికి ఆసక్తి చూపడం లేదు. రెండేళ్ల నుంచి వంద మంది విద్యార్థులకు హెడ్ కుక్ ఒక్కరే వంటచేసి పెడుతున్న పరిస్థితి. వారికి కూడా మూడు నెలల నుంచి వేతనాలు రావడం లేదని వాపోతున్నారు.

**డీఈఓకు వివరించినా ఫలితంలేదు**

హాస్టల్‌లో చాలా సమస్యలు ఉన్నాయి. విద్యుత్, నీటి సరఫరా సమస్యతో సతమత మవుతున్నాం. అలాగే ప్రహరీ నిర్మించాలి. హాస్టల్ పట్టణానికి దూరంగా ఉండటంతో భయంగా ఉంటోంది. వెంటనే వాచ్‌మెన్‌ను నియమించాలి. ఇటీవల హాస్టల్ సందర్శనకు వచ్చిన డీఈఓకు సమస్యల గురించి వివరించాం. అయినా పరిష్కారం కాలేదు.

– సుప్రియ, విద్యార్థిని

**సమస్యల పరిష్కారానికి చర్యలు**

హాస్టల్ నెలకొన్న సమస్యల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాను. అధికారుల ఆదేశాల మేరకు సమస్యలను పరిష్కరిస్తాం. వాచ్‌మెన్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్ పోస్టులకు ఇప్పటికే ప్రకటన ఇచ్చాం. చేరడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. మహిళలకు అవగాహన కల్పించి వెంటనే నియమించేలా చర్యలు తీసుకుంటాం.

– మాధవరెడ్డి, ఎంఈఓ

## కరెన్సీపై అంబేడ్కర్ బొమ్మ ముద్రించండి

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి**



హుస్నాబాద్: పోస్ట్ కార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

హుస్నాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాన్ని కరెన్సీపై ముద్రించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి డిమాండ్ చేశారు. ప్రముఖ ఉద్యమకారుడు జేరిపోతుల పరశురాం ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఫోటో ముద్రణ సాధన సమితి చేపట్టిన రథయాత్ర శనివారం హుస్నాబాద్‌కు చేరుకుంది. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆయన చేత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పోస్ట్‌కార్డు రాయించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సాధన సమితి జిల్లా ఇన్‌చార్జి ముక్కెర సంపత్ కుమార్, అడ్వకేట్ చిత్తారి రవీందర్, నాయకులు వెంకటస్వామి, సత్యనారాయణ, మహేందర్, రాజు, బాలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో..**

అక్కన్నపేట(హుస్నాబాద్): కరెన్సీపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని పరశురాం పిలుపునిచ్చారు. అక్కన్నపేట అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం దళిత, గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీఐ ఏర్పాటు, రాజ్యాంగం రచనలో అంబేడ్కర్ కృషి, త్యాగాలు, చరిత్రను కనుమరుగు చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాష్ట్ర ఎంపీలంతా పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తాలని డిమాండ్ చేశారు. నాయకులు తొందూరు ఎల్లయ్య, భూక్య కృష్ణనాయక్, కరంటోతు రవి, మోహన్‌నాయక్, గుగులోతు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల**



స్టాల్స్‌ను తిలకిస్తున్న మంజుల, కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ మంజుల అన్నారు. స్థానిక కోమటి చెరువు, నెక్లెస్‌రోడ్డుపైన మహిళ సంఘాల(మెప్మా) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లోని స్టాళ్లను కమిషనర్ ఆశ్రిత్, వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి ఆమె తిలకించారు. అనంతరం మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహిళలు తయారు చేసిన గొల్లభామ పిండి వంటలు, సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు, మట్టి గాజులు తదితర 65 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయికుమార్, మెప్మా అధికారి విద్యాసాగర్ పాల్గొన్నారు. అలాగే ఇటీవల ప్రమాదవశాత్తు చనిపోయిన మహిళ సంఘాల సభ్యుల కుటుంబాలకు మున్సిపల్ కార్యాలయంలో రూ.41.36 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రమాదవశాత్తు, వివిధ కారణాలతో చనిపోతే ప్రభుత్వం ప్రమాద బీమా కింద డబ్బులు అందిస్తుందని మంజుల అన్నారు.

## ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



స్టాళ్లను పరిశీలిస్తున్న రమేశ్‌కుమార్

**మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్**

దుబ్బాకటౌన్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో వివిధ మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు తీసుకుంటున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. త్వరలో వనమహోత్సవంలో భాగంగా వార్డుల్లో ప్రజలకు పంపిణీ చేసేందుకు మహిళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల నుండే మున్సిపల్ శాఖ పూల, పండ్ల మొక్కలను కొనుగోలు చేయనుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మెప్మా సీఓ సరిత, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మల్లన్నసాగర్ భూ బాధితులను ఆదుకోండి

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్లస్వామి**

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన భూ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్లస్వామి డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(ఏటిగడ్డ కిష్టాపూర్)కు చెందిన తిగుళ్ల ఐలయ్య మూడో కొడుకుకు ప్యాకేజీ రాలేదనే బెంగతో అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్వామి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ మల్లన్నసాగర్ భూ బాధితులకు చట్ట ప్రకారం తగిన పరిహారం చెల్లించాలని అనేక పోరాటాలు చేశారని, రేవంత్‌రెడ్డి సైతం రెండు రోజులు దీక్ష చేశారని గుర్తుచేశారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీలు ఇవ్వకపోవడంతో చాలా మంది బాధితులు ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే న్యాయం చేయాలని, తగిన పరిహారం అందేలా చూడాలని బహిరంగలేఖ రాస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

### పాడి రైతుల శ్రేయస్సే లక్ష్యం

ములుగు(గజ్వేల్): పాడి రైతుల శ్రేయస్సే లక్ష్యంగా విజయ డెయిరీ పనిచేస్తుందని ఆ డెయిరీ డిప్యూటీ డెరెక్టరు నాగేశ్వర్‌రావు అన్నారు. ములుగు మహిళా సమాఖ్య కార్యాలయంలో పాల సేకరణ కేంద్రం నిర్వాహకులు, మహిళా సంఘం సభ్యులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో డీపీఎం వాసుదేవ్‌రావు, ఏపీఎం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### జాబితాను బహిర్గతం చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వుల జాబితాను బహిర్గతం చేయాలని యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలీ అహ్మద్, తప్పెట్ల యాదగిరిలు డిమాండ్ చేశారు. పలువురు నాయకులతో కలిసి వారు సెక్టోరియల్ అధికారి రామస్వామికి శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో సుమారు 266 మంది మిగులు ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేస్తూ జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే ఈ జాబితా నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత జాబితాను బహిర్గతం చేయకపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, బాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### బురద.. వెళ్లేదెలా?



వర్గల్(గజ్వేల్): చిన్న చినుకు పడినా వర్గల్–శేరిపల్లి రోడ్డు బురదమయంగా మారుతోంది. పల్లెలను కలుపుతూ వేసిన ఈ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 55 శాతం మార్కులు సాధించి, పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని, 23లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

### టిప్పర్లు స్వాధీనం

కొండపాక(గజ్వేల్): అనుమతి లేకుండా చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, ఇటాచీని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని దమ్మక్కపల్లిలోని చెరువులోనుంచి అక్రమంగా మట్టిని తవ్వి టిప్పర్లలో తరలించి విక్రయిస్తున్నారన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడిచేశామని చెప్పారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం

**ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



మాట్లాడుతున్న యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ఎండగడతామని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. 20 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో వర్షాలు కురవని సందర్భంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ జలాశయాల ద్వారా సాగునీరు అందించి వ్యవసాయరంగాన్ని సస్యశ్యామలంగా ఉంచేవారని చెప్పారు. ఇప్పటికైనా జిల్లాలోని రిజర్వాయర్లను వెంటనే నింపాలని, లేని పక్షంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలను పట్టించుకోకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై కేసీఆర్, ఆయన కుటుంబాన్ని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీల కుట్రలను బయట పెడతామని చెప్పారు. సమావేశంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, సహకార సంఘం చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్‌ఎస్ గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ జెడ్పీటీసీలు మల్లేశం, బొల్లారం ఎల్లయ్య, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక: కూడవెల్లి రామలింగేశ్వర ఆలయంతో పాటు రేకులకుంట మల్లన్న ఆలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎండోమెంట్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.50 లక్షల సీజీఎఫ్ నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. ఈ ఆలయాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దామని, అందుకోసం వెంటనే మాస్టర్ ప్లాన్‌ను తయారుచేసి తనకు అందించాలని సూచించారు. ఆలయాల వద్ద తగిన సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. 23న కూడవెల్లి, మల్లన్న ఆలయాలను సందర్శించి ప్రణాళిక తయారు చేద్దామని అధికారులకు తెలిపారు. సమావేశంలో ఎండోమెంట్ ఎస్ఈ ఓం ప్రకాశ్, స్థపతి లింగం, ఎండోమెంట్ అధికారులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రణం శ్రీనివాస్‌గౌడ్, రాజు, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## గోరింటాకుతో అందం.. ఆరోగ్యం

**మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల**



గోరింటాకు చూపుతున్న మంజుల తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గోరింటాకుతో కేవలం అందమే కాకుండా ఆరోగ్యం కూడా లభిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ మంజల అన్నారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ , సిద్దిపేట మహిళా జాగరణ సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి వ్యాస మహర్షి యోగ కేంద్రంలో గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. మహిళలు అందమైన ఆకృతులతో గోరింటాకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు సామూహిక ఏకత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. అనంతరం యోగ గురువు తోట సంధ్య, మహిళా జాగరణ జిల్లా అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ సద్ది నాగరాజురెడ్డి, దిశ కమిటీ జిల్లా సభ్యురాలు వనజ, యోగా సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శిక్షకులు సతీశ్, సభ్యులు బసవరాజ్ కుమార్, సురేశ్, మంజుల, అరుణ, లావణ్య, మౌనిక, ఉమాదేవి, నిత్య తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో రాణిద్దాం



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

**మెదక్ ఎంపీ రఘునందన్‌రావు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా కృషి చేద్దామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యకర్తలకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల సమస్యలపై వారికి అండగా ఉండి పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, మనోహర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రారెడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**వచ్చేవి మన రోజులే..**

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు రోజులు దగ్గరపడాయని, వచ్చేవి మన రోజులేనని రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని మంగోల్, లకుడారం, కుకునూరుపల్లి, బొబ్బాయిపల్లి, మాత్‌పల్లి, చిన్నకిష్టాపూర్, రాయవరం గ్రామాల కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు బీజేపీలోకి చేరారు. రఘునందనరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కేంద్ర మంత్రికి వినతి**

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని రఘునందన్‌రావు శనివారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట నుంచి కొత్తపల్లి వరకు రెండో దశలో భాగంగా రైల్వేలైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వివరించినట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు సూరగోని శేఖర్‌గౌడ్ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

## అంబరాన్నంటిన బోనాల సంబురాలు

ఆషాఢమాసం బోనాల పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన ముందస్తు బోనాల సంబురాలు అంబరాన్నంటాయి. ఉపాధ్యాయులు, విద్యార్థినులు స్వయంగా బోనాలు తయారు చేశారు. అనంతరం సామూహికంగా బోనాలు నెత్తిన పెట్టి కేరింతల నడుమ ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ విద్యార్థులు పోతరాజుల వేషధారణలో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు.



మిరుదొడ్డి మోడల్ స్కూల్‌లో తయారు చేసిన బోనాలతో టీచర్లు



దౌల్తాబాద్(దుబ్బాక): గాజులపల్లిలో బోనాలను ఊరేగిస్తున్న విద్యార్థులు



బెజ్జంకి మోడల్ స్కూల్‌లో బోనాల కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు